
# సీటీ గ్యారంటీ

## ఎస్. ఎస్. వి. రమణారావు




"బాబూ, ఈ ఎడ్రస్ ఎక్కడో కొంచెం చెప్పగలవా?'' అడిగాడు నలభై అయిదేళ్ళ విఙ్ఞేశ్వర్. పక్కనే పద్దెనిమిదేళ్ళ అతని కూతురు తేజు. సిటీలో రద్దీగా వుండే ఒకానొక జంక్షన్‌లో వున్న ఒక సెల్ఫ్ సర్వింగ్ టీ పార్లర్ అది.

"మీరు కనీసం రెండు టీ అయినా తాగుతారా?'' నిర్మొహమాటంగా అడిగాడు కాష్ కౌంటర్‌లో కూర్చున్న పార్లర్ ఓనర్.

విఙ్ఞేశ్వర్‌కి కోపం వచ్చింది. గొంతు పెంచాడు.

"ఏంటయ్యా? బొత్తిగా మర్యాద లేకుండా మాట్లాడుతున్నావు? టీ తాగకపోతే అడ్రస్ చెప్పవా?''

"ఎందుకు చెప్పాలి?'' పార్లర్ ఓనర్ కూడా గొంతు పెంచాడు. "మీరు ఒక టీ తీసుకోండి. అమ్మాయి చిన్నపిల్ల కదా. ఆకలి ఎక్కువ ఉంటుంది. టీ, టిఫిను తీసుకుంటుంది. ఏమిటి? ఆర్డర్ చెప్పమంటారా? అడ్రస్ చెప్పేస్తాను.'' తొందరచేశాడు పార్లర్ ఓనర్.

విఙ్ఞేశ్వర్ ఏదో చెప్పబోయేంతలో... అంత వరకు అక్కడే నిలబడి, వీళ్ళ మాటలు వింటూ, మధ్య మధ్య దిక్కులు చూస్తూ నిలబడి వున్న ఒక యువకుడు సడన్‌గా కౌంటర్ వద్దకు వచ్చి అరచేత్తో

కాష్ కౌంటర్ టేబుల్ మీద బలంగా చరిచాడు. ఆ దెబ్బకి ఛళ్ళున పెద్దశబ్దం వచ్చి, కాష్ టేబుల్ మీద నున్న సోంపు, బిల్లులు గుచ్చిన స్టేండు, పెన్ను అన్నీ ఒక్కసారిగా గాల్లోకి లేచాయి.

''అంకుల్ మీరు పక్కన వున్న టీస్టాల్‌కి వెళ్ళండి. అక్కడ ఒక టీకి మాత్రమే మీకు అడ్రస్ చెప్పబడుతుంది. నాకు కావలసిన అడ్రస్ నేను అక్కడే కనుక్కున్నాను. ఈ జెగిని ఉండగా ఈ అన్యాయాన్ని మీరు సహించవలసిన అవసరం లేదు'' అని చేయిని యింకా పైకెత్తి మళ్ళీ బలంగా చరచబోయాడు. పార్లర్ ఓనర్ వెంటనే ఆ యువ కుడి చెయ్యిని గాల్లోనే పట్టుకున్నాడు.

''బాబూ. నువు యింకో దెబ్బ కొట్టావంటే ఈ బల్ల ఆగదు.'' అని విజ్ఞేశ్వర్ వైపు చూసి గంభీరంగా తల పంకించి అన్నాడు.

''ఓకె సార్. యిద్దరూ టీ తాగండి. టిఫిన్ అవస రంలేదు. ఏదీ ఆ అడ్రస్ యివ్వండి.''

''అదీ కాంపిటీషన్ అంటే..'' కొత్తగా నేర్చుకున్న విజ్ఞానంతో విజ్ఞానేశ్వర్ మొహం వెలిగిపోయింది. ఆ సంతోషంలో.

''నువ్వు కూడా ఒక టీ తాగు యంగ్‌మేన్'' అని ఆ యువకుడ్ని ఆహ్వానించాడు. జెగిని అన్న ఆ యువకుడు వెంటనే సీరియస్‌గా కళ్ళు పెద్దవి చేసి, సీరియస్‌గా విజ్ఞేశ్వర్ వంక, తేజువంక మార్చి మార్చి చూశాడు.

''ఎవరు మీరు? ఎందుకు నన్ను టీకి పిలుస్తు న్నారు? నాకు, మీకు ఏమిటి సంబంధం?''

విజ్ఞేశ్వర్ బిత్తరపోయాడు. కాని రెగ్యులర్‌గా అన్ని సినిమాలు విడవకుండా చూసే తేజు కంగా రుపడలేదు. పైగా చాలా థ్రిల్లింగ్‌గా ఫీలయింది ఆ మాటలు వినగానే.

''అదికాదు బాబూ...'' అంటూ ఏదో చెప్పబో యేంతలో–

''మీరేం చెప్పనక్కరలేదు. నాకంతా అర్థమైపో యింది. అదిగో మీకు, మీ అమ్మాయికి మెడమీద చెమట పట్టింది. ఓహ్.'' అని తలపట్టుకున్నాడు ఆ జెగిని.

ఇంత చిన్న టీ పార్లర్‌లో నేను కనబడినప్పటికీ నేను టెల్ ఎయిర్ ఎండిని అని మీకు తెలిసిపో యింది. నా ఎసి కారు వెంబటే తరుముకుంటూ మీరు వచ్చారు. అందుకనే మీకు, మీ అమ్మాయికి చెమటపట్టింది. నాక్కూడా చెమట పట్టినప్పటికీ అది నా కారులో ఎసి పనిచేయకపోవడం వల్ల వచ్చింది.'' తన మొహానికి, మెడకు పట్టిన చెమట చేత్తో తుడుచుకున్నాడు జెగిని.

''మీ అమ్మాయిని నాకు యిచ్చి పెళ్ళి చేద్దామని చూస్తున్నారు. అవును కదూ? హహహ, డోంట్ అండర్ ఎస్టిమేట్‌మి. అయామ్ జెగిని, ఎండి ఆఫ్ టెల్ ఎయిర్''

ఇంతలో పార్లర్‌లోకి ఒక నడివయస్సులో వున్న వ్యక్తి దాదాపు పరిగెత్తుకుంటూ వచ్చాడు. ''అబ్బా! జెగినీ, ఇక్కడున్నావా?'' అంటూ చుట్టూ అందరివంకా ఒకసారి చూశాడు.

''నాపేరు ఆర్‌కె పిళ్ళై. జెగిని మా అబ్బాయి. మిమ్మల్నేమైనా యిబ్బంది పెట్టాడా? ఏమీ అనుకో కండి. మా అబ్బాయికి అరగంటకొకసారి మెమొరీ లాస్ అవుతూ ఉంటుంది. అపుడు కొంచెం వింతగా ప్రవర్తిస్తుంటాడు.''అని చేతివాచి వంక చూశాడు.

''ఇక ఫరవాలేదు లెండి. అరగంట అయి పోయింది. ఇంకొక పావుగంట దాకా యిబ్బంది లేదు.''

అందరూ కూర్చుని టీ తాగడం మొదలు పెట్టారు.

''మరి మీ అబ్బాయికి ట్రీట్‌మెంట్ ఏమయినా యిప్పిస్తున్నారా?'' అడిగాడు విజ్ఞేశ్వర్, ఆర్‌కె పిళ్ళైని.

''లేదండీ. ఇప్పుడే ఇంజనీరింగ్‌లో జాయిన్ చేసి వస్తున్నాను.''చెప్పాడు పిళ్ళై.

అదిరిపడ్డాడు విజ్ఞేశ్వర్ ఆ మాటలు వినగానే.

''ఆ వీడా!! యింజనీరింగా!!!''

ఆ మాటలకు పిళ్ళై ఏమీ కోపం తెచ్చుకోలేదు.

''నేనూ అలానే అనుకున్నాను మొదట మీలాగే. కాని నాకు వచ్చిన ఆఫర్‌ను చూసి వదులుకోలేక జాయిన్ చేశాను.'' చేతిలో కప్పు పైకెత్తి టీ రెండు సిప్‌లు చేశాడు పిళ్ళై. ''అంతే కాదు. వీడికంా ఇంట ర్మీడియట్ కూడా పాసవ్వలేదు. వీడి మెమొరీ లాస్ జబ్బువల్ల మూడుగంటల పరీక్ష వీడు రాయాలంటే ముప్పై ఆరుగంటలు కావాలి. అది సాధ్యం కాకపో వడంతో వీడు పాసవ్వలేదు. కాని నేను జాయిన్ చేసిన ఇంజనీరింగ్ కాలేజి ఓనర్‌కి ఒక ఇంటర్మీడి యట్ కాలేజి కూడా ఉందంట. ఇంటర్మీడియట్ తనే పాస్ చేయిస్తాననీ, మెడికల్ ట్రీట్‌మెంట్ కూడా తనే యిప్పిస్తాననీ పర్సనల్‌గా ప్రామిస్ చేయడంతో జాయిన్ చేశాను.'' టీ కప్పు క్రింద పెట్టాడు పిళ్ళై.

''చాలా మంచి ఆఫర్ సంపాదించారు.'' అన్నాడు విజ్ఞేశ్వర్ టీ కప్పు కిందపెడుతూ.

''మీరు కూడా తొందరపడి ఏదో ఒక కాలేజిలో జాయిన్ చేసేయకండి.

అమ్మాయి కదా, డిగ్రీతో పాటు పెళ్ళి సంబంధం కూడా చూడాలని చెప్పండి. కట్టిన ఫీజ్‌లో కొంత కట్నం కింద వాపసు యివ్వాలని చెప్పండి. గట్టిగా బేరమాడండి. విజయం మీదే.''

పిళ్ళై, జెగిని బయటకు వెళ్ళిపోయారు. ఒక మూడు నిముషాలు నిశ్శబ్దంగా కూచున్న తరువాత టీకి డబ్బులు చెల్లించడానికి కుర్చీలోంచి లేచాడు విజ్ఞేశ్వర్. తేజుకి వెంటనే గుర్తొచ్చింది అడ్రస్ సంగతి.

''డాడీ ఆగు. మన అడ్రస్ యింకా రాలేదు.'' గట్టిగా అరిచింది. ఎంత గట్టిగా అరిచిందంటే ఆ అరుపుకి పార్లర్‌లోని వాళ్ళందరూ ఒక్కసారిగా ఉలి క్కిపడి తలలు తిప్పి చూశారు. కరంటు షాకు కొట్టి నట్టు విజ్ఞేశ్వర్ జేబులో పెట్టిన చెయ్యి వెనక్కు తీసు కున్నాడు. ఆ అరుపుకి చెవులు మూసుకున్న పార్లర్ ఓనర్ విసుక్కున్నాడు.

''నీకు అడ్రస్ చెప్పాకే డబ్బులు తీసుకుంటాంలే వమ్మా. ఏరోప్లేన్ లాండింగ్ సౌండ్‌లాగా ఆ సౌండేంటి? నీ అరుపుకి షాపులో గ్లాసులు, కప్పులు బద్దలయిపోతాయి. ఒరే ఆ షాజహాన్

''ఎఎఎ కాలేజా? ఇది అమర్, అక్బర్, ఏంథోనీ కాలేజి. ఇక్కడనుంచి పదడు గులు ఎడమ పక్కకు వేసి, కుడివైపు రెండడుగులు వేస్తే అక్కడొక బావి కనబడు తుంది. కాని అది బావి కాదు. ఆ బావిలోకి మెట్లుంటాయి. ఆ మెట్లు దిగగానే కనబడుతుంది. మీరు వెదుకుతున్న ఎఎఎ కాలేజి''
''బావిలో కాలేజా?'' విజ్ఞే శ్వర్ వంక ఆశ్చర్యంగా చూశాడు.

గాడ్ని పిలవండి అడ్రస్ చెప్తాడు.'' అని పైకి అని, 'తాగిన రెండు టీలకి ఇంటికి వచ్చి అంట్లు కూడా తోమమనేటట్టున్నారు. కాంపిటీషన్ అంతా కాంపి టీషన్' గొణుక్కున్నాడు. ఇంతలో నడుముకి తువ్వాలు కట్టుకుని, కట్ బనీను వేసుకుని, చేతి కంటిన చమురు తుడుచుకుంటూ, పొట్టిగా, ఎర్రగా ఉన్న షాజహాన్ అనే కుర్రవాడు అక్కడికి వచ్చాడు. ఎడ్రస్ కాయితం చూస్తూనే పూర్తిగా చద వకుండానే.


''ఎఎఎ కాలేజా? ఇది అమర్, అక్బర్, ఏంథోనీ కాలేజి. ఇక్కడనుంచి పదడుగులు ఎడమ పక్కకు వేసి, కుడివైపు రెండడుగులు వేస్తే అక్కడొక బావి కనబడుతుంది. కాని అది బావి కాదు. ఆ బావిలోకి మెట్లుంటాయి. ఆ మెట్లు దిగగానే కనబడుతుంది. మీరు వెదుకుతున్న ఎఎఎ కాలేజి''

''బావిలో కాలేజా?'' విజ్ఞేశ్వర్ వంక ఆశ్చ ర్యంగా చూశాడు.

''ఆ బావిలో రెండు కాలేజీలు ఉన్నాయి. కాని కనుక్కోవడానికి మీకే ప్రాబ్లమ్ ఉండదు. ట్రిపుల్ మైనారిటీ కాలేజ్ అంటే మీకు వెంటనే చూపి స్తారు.''

''ట్రిపుల్ మైనారిటి కాలేజీయా? అదేమిటి బాబూ?''

''అంటే మూడుమతాల వాళ్ళకి ఒక్కొక్క మతా నికి వన్‌థర్డ్ సీట్స్ రిజర్వ్ చేయడం ద్వారా గవర్న మెంటునించి అన్ని మైనార్టీ సంస్థలకిచ్చే సదుపా యాలు కొట్టేసే టెక్నిక్. ఈ టెక్నిక్‌ని ఆ మేనేజ్




మెంట్ పేటెంట్ కూడా చేసింది వేరెవరూ కాపీ కొట్టకుండా.'' తేజు సంతృప్తిగా తలాడించడంతో టీకి డబ్బులు చెల్లించాడు విజ్ఞేశ్వర్. పార్లర్ నుంచి బయటకు వస్తూ ఆఖరి ప్రశ్న అడిగాడు విజ్ఞేశ్వర్–షాజహాన్‌ని.

''బాబూ, ఇన్ని వందల ఇంజనీరింగ్ కాలేజీలలో ఈ ఎఎఎ కాలేజి గురించి నీకింత వివరంగా ఎలా తెలుసు?''

''నేనక్కడే సార్ బిఇ చదివింది.'' సచిన్ టెండుల్కర్‌ని అవుట్ చేసిన బంగ్లాదేశ్ ఫాస్ట్ బౌలర్‌లాగా కాలర్ ఎగరేశాడు షాజహాన్.

''ఆ కాలేజి కేంపస్ ఇంటర్వ్యూలోనే నాకు ఈ కుక్ ఉద్యోగం వచ్చింది. ఆ ఇంటర్వ్యూకి వెళ్ళడం, సెలెక్ట్ కావడం నిజంగా అదొక థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్'' ఉద్వేగంతో ఊగిపోయాడు షాజహాన్.

పెరిగిన జ్ఞానంతో, పార్లర్‌నుండి బయటకు వచ్చారు విజ్ఞేశ్వర్, తేజు.

***

ఏటి పొడుగునా
పిల్లల్ని కనడమేనా పని?
లేదా మరి వేరే యింకేదైనా పని?

ఏదో పెళ్ళి మైక్‌సెట్‌లో వస్తోంది పాట. షాజహాన్ అంత డిటెయిల్డ్‌గా చెప్పినా ఎఎఎ బావికాలేజి కనుక్కోవడం కొద్దిగా కష్టమే అయింది విజ్ఞేశ్వర్ తేజాలకి. బావిమెట్లు దిగబోతుండగా.

ఎక్స్‌క్యూజ్ మి సార్!'' అని వినబడి చటుక్కున వెనక్కు తిరిగి చూశారు యిద్దరూ. కొద్దిగా మాసిన తెల్లటి షర్ట్, రెడ్ టై, బ్లూపేంట్, ఇరవై రెండు ఇరవై మూడు మధ్య వుంటుంది వయసు ఆ యువకుడికి. అతన్ని చూస్తూనే విజ్ఞేశ్వర్ ''బాబూ, నాకే క్రెడిట్ కార్డు వద్దు. నేను కొంచెం పనిలో ఉన్నాను. నన్నొది లెయ్..'' అన్నాడు.

''నేను క్రెడిట్ కార్డు ఏజంటును కాదు సార్.'' అన్నాడు ఆ యువకుడు చిరునవ్వుతో.

''అయితే ఇన్సూరెన్స్ ఏజంటువా. నాకు ఎల్ఐసిలు, జిఐసిలు కార్ ఇన్సూరెన్స్‌లు అన్నీ అయిపోయాయి నాయనా. యింకేవీ లేవు నన్ను వెళ్ళనీయి.'' మళ్ళీ మెట్లు దిగబోయాడు విజ్ఞేశ్వర్

''నేను ఇన్సూరెన్స్ ఏజెంట్‌ని కూడా కాదు సార్.'' అదే చిరునవ్వుతో అన్నాడతను. విజ్ఞేశ్వర్ కి చాలా ఆశ్చర్యమేసింది.

''వద్దు. ఛీపో అంటున్నా నువు చిరునవ్వుతో కదలట్లేదు. నువు కొంపదీసి వారెవ్వా క్రేక్స్ ఏజెంట్‌వా. మీ వాటర్‌ప్యూరిఫయర్ కొన్నాం నాన్నా యింకొదిలెయ్''

''నేను వారెవ్వా క్రేక్స్ ఏజెంట్ని కూడా కాదు సార్.'' అదే చిరునవ్వుతో అన్నాడు యువకుడు.

''డాడీ'' గట్టిగా అరిచింది తేజు. ''నువ్వేం చెప్పినా కాదంటున్నాడు నాకీ అబ్బాయి నచ్చాడు. ఇతను చెప్పేది విందాం.'' ఆ యువకుడు ఆవేశంగా మాట్లాడటం ప్రారంభించాడు.

''నాపేరు నవ్యక్. ఇలాంటి బావి కాలేజిలో మీ అమ్మాయిని జాయిన్ చేసి ఎందుకు సార్ మీ అమ్మాయి జీవితం నాశనం చేస్తారు. పెద్ద పెద్ద క్లాస్ రూమ్స్, టాయిలెట్స్, కేంటీన్‌లు, ప్లే గ్రౌండు ఉన్న కాలేజి ఎంతో సరసమైన ధరకే చూపిస్తాను. నాతో రండి.''

''ఛ! యింకోమాట చెప్పు'' అన్నాడు విజ్ఞేశ్వర్.

''నా మాటలు నమ్మొద్దు సార్, మీ కళ్ళను నమ్మండి. నాకొక్క అవకాశం యివ్వండి.''

నవ్యక్ మాటలు నమ్మకపోయినా, వాడు కాలేజి గురించి చెబుతున్న విషయాలు వింతగానూ, అద్భుతంగానూ అనిపించి సరేనన్నాడు విజ్ఞేశ్వర్. వెంటనే ఆటో ఎక్కించి ఆ ఏరియా నుంచి యింకో ఏరియాకు తీసుకు వెళ్ళాడు నవ్యక్. అక్కడ రెండు ఎత్తయిన విశాలమైన బిల్డింగ్‌లు, మరింత విశాలమైన పార్కింగ్ స్పేస్‌తో పక్కపక్కనే ఉన్నాయి. అవి జుష్‌బూ, జహనాబాద్ థియేటర్‌లు. నవ్యక్‌ను చూస్తూనే సలామ్ కొట్టి థియేటర్ గేటు తెరిచాడు జుష్‌బూ థియేటర్ వాచ్‌మెన్.

''రండి సార్ రండి ఇదే మన కాలేజి.''

అదిరిపడ్డాడు విజ్ఞానేశ్వర్.

''ఇదా కాలేజీ!? ఇది సినిమా థియేటర్ కదా?''

''భలేవారే సార్'' బిగ్గరగా నవ్వాడు నవ్యక్ జుషబూ పార్కింగ్ స్పేస్ మధ్యలో నిలబడి. ''మార్నింగ్ షో ఎయిట్ టు నైన్ టైమ్స్‌లోనే సార్ థియేటర్ మిగతా టైమ్స్‌లో యిది మన యింజనీరింగ్ కాలేజి. ఇంత విశాలమైన స్థలం మీకు ఆ బావి కాలేజీలో ఎక్కడుంది?''

''నిజమే, పార్కింగ్ స్పేస్ ఎక్కువగానే ఉంది. కర్టెన్స్‌తో పార్టిషన్స్ చేసి టెంట్స్ వేసి కుర్చీలు వేస్తే నాలుగైదు క్లాస్‌రూమ్స్ అవుతుంది.'' అనుకున్నాడు విజ్ఞేశ్వర్. వెంటనే ఉలిక్కిపడ్డాడు. 'ఇదేమిటి? యిలా ఆలోచిస్తున్నాను.?' అనుకుని ఏదో అనబోయేలోగా అందుకుని– ''అంతేకాదు, మనకి, ఈ థియేటర్‌కి టై అప్ ఉంది. ఇక్కడ కేంటీన్, టాయిలెట్స్ అన్ని ఫెసిలిటీస్. మనం వాడుకోవచ్చు.''

విజ్ఞేశ్వర్‌కి ఏం మాట్లాడాలో తెలియక దిక్కులు చూడడం మొదలుపెట్టాడు. తండ్రి సందిగ్ధ స్థితిని గమనించిన తేజు అడిగింది

''క్లాస్‌రూమ్స్ సరే మరి లేబ్స్ ఎక్కడ?''

తన కూతురు తెలివితేటలు ప్రత్యక్షంగా చూసి విజ్ఞేశ్వర్ మొహం వెలిగింది. కాని నవ్యక్ ఏమాత్రమూ కంగారు పడలేదు. ఈ ప్రశ్న అడుగుతారని ముందే ఊహించినట్టు చిన్నగా నవ్వి, థియేటర్ లోపలికి తీసుకు వెళ్ళాడు. అది ఇంటర్వెల్ తర్వాత ప్రేక్షకులు కాఫీలు, టీలు తాగే ప్రదేశం ఒక మూల తాత్కాలికంగా నిర్మించబడ్డ స్టేజి. సినిమా షో నడుస్తున్నప్పటికీ ఆశ్చర్యంగా అక్కడ చాలామంది మనుషులున్నారు.

''సినిమా ఇంటర్వెల్ టైమా?'' డౌట్ అడిగాడు విజ్ఞేశ్వర్.

''లేదు సార్, వీళ్ళు కూడా మీలాగే మన కాలేజి చూద్దామని వచ్చినవాళ్ళు'' ఎడ్యుకేట్ చేశాడు నవ్యక్. తేజు ఏదో అడగబోయేంతలో 'సైలెన్స్' అంటూ గట్టిగా వారించాడు. ఎదురుగుండా ఉన్న స్టేజిమీద నల్లటికోటు, కళ్ళజోడు, బట్టతల ఉన్న ఒక నడివయసు వ్యక్తి స్టేజి మీదకు చకచక నడుచుకుంటూ వచ్చాడు. అతడు స్టేజి మీదకు రాగానే కిటికీలన్నిటినీ మూసేసి లైట్లార్పేయడంతో అంతా చీకటి ఆవరించింది. స్టేజి మీద మాత్రం లైట్లు వెలుగుతున్నాయి.

''ఎవరతను?'' అని విజ్ఞేశ్వర్ అడిగేలోపే ఆ స్టేజిమీద వ్యక్తి మాట్లాడటం ప్రారంభించాడు.

''డియర్ స్టూడెంట్స్. నాగురించి మీకు తెలిసీ ఉంటుంది. నన్ను నేను మీకు పరిచయం చేసుకోనక్కర్లేదు. అయినా ఫార్మాలిటీ కోసం పరిచయం చేసుకుంటా. నేనొక హిప్నాటిస్ట్‌ని. నేను యిప్పుడు మొట్టమొదటిగా మీకు చెప్పబోయేదేమిటంటే యిది మీరందరూ అనుకుంటున్నట్టుగా కేంటీన్ కాదు. లేబ్. మీరింతకు ముందు చూసిన లేబ్‌లకు ఈ లేబ్‌కు తేడా ఏమిటంటే ఇక్కడ అన్ని సబ్జెక్ట్స్ లేబ్‌లు ఒకే చోట జరుగుతాయి. వేరు వేరు చోట్ల జరగవు. ఇది ఎలాగ అంటే నేను ఒక బ్రాంచ్ ఎక్స్‌పెరిమెంట్స్ చెప్పేటప్పుడు మిగతా బ్రాంచీల వాళ్ళు చెవుల్లో దూది పెట్టుకోవాలి. ఓకే. లెటజ్ స్టార్ట్. నాకు ఎక్కువ టైమ్ లేదు. నేనింకా చాలా

కాలేజీల్లో ఎక్స్‌పెరిమెంట్స్ చేయించాలి. ఇప్పుడు మనం మెకానికల్ ఇంజనీరింగ్ ఎక్స్‌పెరిమెంట్స్ చేయబోతున్నాం. మిగిలిన వాళ్ళందరూ దూదిలు పెట్టుకోండి.''

ఒకసారి గొంతు సవరించుకున్నాడు.

''ఒక్కసారి అందరూ కళ్లు మూసుకుని మీ యిష్టదైవాన్ని తలుచుకోండి. (ఎందుకంటే మీకందరికీ యిక దేవుడే దిక్కు కాబట్టి.) మీరు అందరూ యిప్పుడు గాఢనిద్రలోకి జారుకుంటున్నారు... జారుకుంటున్నారు... జారుకుంటున్నారు. మీరు యిప్పుడు పెర్‌ఫార్మెన్స్ కేరెక్టర్‌స్టిక్‌ఆఫ్ ఎ పెట్రోల్ కార్ యింజన్ అనే ఎక్స్‌పెరిమెంట్ చెయ్యబోతున్నారు. మీ అందరి ఎదురుగుండా పెట్రోల్ కార్ యింజన్ ఉంది. కార్ యింజన్ ఉంది. కార్ యింజన్ ఉంది. మీ చేతిలో ఇగ్నిషన్ కీ ఉంది.. ఇగ్నిషన్ కీ ఉంది.. ఇగ్నిషన్ కీ ఉంది. ఇంజన్ కీ హోల్లో ఇగ్నిషన్ కీ పెట్టి తిప్పి ఇంజన్ స్టార్ట్ చేస్తున్నారు... చేస్తున్నారు.. చేస్తున్నారు. డు డు డు డు.. ఇంజన్ స్టార్ట్ అయింది... మీ కందరికీ శబ్దం వినబడుతోందా?''

''వినబడుతోంది సార్'' అన్నారు చెవుల్లో దూదులు లేని విద్యార్థులందరూ.

''ఇక వెడదామా సార్'' లో గొంతుకతో నెమ్మదిగా అడిగాడు నవ్యక్.

''అలాగే'' అన్నాడు విజ్ఞేశ్వర్ అంతకంటే లో గొంతుకతో నెమ్మదిగా.

''పదండి.'' అంది తేజు వినీ వినబడని స్వరంతో.

***

నవ్యక్, విజ్ఞేశ్వర్, తేజు ముగ్గురూ థియేటర్ బయటకు సారీ కాలేజీ బయటకు వచ్చారు. బయట ఎవరో యింకొక పేరెంట్, వాళ్ల అబ్బాయి, నవ్యక్ లాంటి యింకొక ఏజెంట్ ఉన్నారు. ఆ పేరెంట్ అంటున్నాడు.''ఏంటయ్యా? ఇదేం కాలేజీ? రోడ్డు మీద క్లాసులు, లైబ్రరీ లేదు, లేబ్‌లు లేవు, స్టాఫ్ లేదు, ప్లే గ్రౌండ్ లేదు. నీలాంటి ఒకరిద్దరు బ్రోకరుగాళ్ళతో కాలేజి నడిపేద్దామనుకుంటోందా మీ మేనేజ్‌మెంటు? రాష్ట్రంలో మీదొక్కటే కాలేజి కాదు. పేరున్న కాలేజీలు ఉన్నాయి. డొనేషన్ కట్టయినా అక్కడే జాయిన్ చేస్తాను కాని చచ్చినా మా అబ్బాయిని యిక్కడ జాయిన్ చెయ్యను.''

''మీరు చెప్తున్న ఫెసిలిటీస్ ఉన్న కాలేజీలన్నీ కూడా మొదట్లో యిలాగే ఉన్నాయి. అవి ఎదగడానికి ఇరవై అయిదేళ్లకిపైగా పట్టింది.''

''మరి ఇంతకాలం వచ్చిన డబ్బులన్నీ ఏం చేశారయ్యా?''

''తక్కువ కాలేజీలు వున్నప్పుడు స్టూడెంట్స్ ఎలాగూ జాయిన్ అవుతున్నారు కదా ఇన్వెస్ట్ చెయ్యడం దండగ అని చెయ్యలేదు. కాలేజీలు ఎక్కువవడం వల్ల , స్టూడెంట్స్ జాయిన్ అవ్వకపోతే ఫెసిలిటీస్ ఎందుకు క్రియేట్ చెయ్యాలి? అసలు ఎలా క్రియేట్ చేస్తాం?'' ఆశ్చర్య పోయాడా ఏజెంట్. ఆ పేరెంట్ కన్విన్స్ అవలేదు. ఇదంతా చూస్తున్న నవ్యక్ '' ఒక్క నిముషం సార్'' అని విజ్ఞేశ్వర్‌కి చెప్పి ఆ పేరెంట్ దగ్గరకు వెళ్ళాడు.

''చూడండి పేరెంట్ గారూ, మా కాలేజి సంగతి వదిలేయండి. మీ అబ్బాయిని చూస్తే చాలా సెన్సిటివ్‌గా వున్నాడు. మీరు డొనేషన్ కట్టి ఆ పెద్ద కాలేజీలో జాయిన్ చేస్తే, అక్కడ ఉన్న తెలివైన స్టూడెంట్స్ లాగా చదవలేక, పరీక్షల్లో మార్కులు తెచ్చుకోలేక, కనీసం పాసవ్వలేక మీ అబ్బాయి ఆత్మహత్య చేసుకునే ప్రమాదం ఉంది. ఆలోచించుకోండి. నేనిలా డైరెక్ట్‌గా అంటున్నానని మీరేం ఫీల్ కావద్దు. మీ అబ్బాయి ఫేస్ రీడింగ్, పేపర్లో వచ్చిన వార్తల ఆధారంగా చెప్తున్నాను.'' అని పేరెంట్‌కు కాస్త దగ్గరగా వచ్చి లోగొంతుకతో అన్నాడు. ''మన కాలేజీలో డిగ్రీ అయిపోనివ్వండి. కావలిస్తే మీరు చెప్పిన కాలేజిలో మీ అబ్బాయికి ఉద్యోగం వేయిద్దాం.

''అదేంటి? పెద్ద కాలేజీల్లో సీటురావడం కష్టమూ, ఉద్యోగం రావడం సులభమేనా?''

''భలేవారు సార్. అన్నీ నాచేత చెప్పిస్తారు.ప్రైవేటు కాలేజీల్లో స్టూడెంట్స్ ఎడ్మిషన్స్ వరకే సార్ అన్ని రూల్స్. కాలేజీకి సంబంధించిన మిగతా ఏ విషయాల్లోనూ రూల్సేమీ ఉండవు, ముఖ్యంగా స్టాఫ్ విషయంలో. ఇప్పుడు ఎడ్మిషన్స్‌లో కూడా అన్ని రూల్స్ ఎత్తేశారు.''

పేరెంట్ ఆలోచనలో పడ్డాడు. నవ్యక్ ఆ రెండో ఏజెంట్ దగ్గరకు వెళ్ళి ''చచ్చినట్టు జాయిన్ చేస్తాడు. తిరుగులేదు.'' అని విజ్ఞేశ్వర్ దగ్గరకు వచ్చాడు.

''నా జూనియర్ సార్‌కి హెల్ప్ చేద్దామని వెళ్ళాను.'' ఒక జాబ్ సాటిస్‌ఫేక్షన్ నవ్వు ఒకటి నవ్వాడు. ''మీ అమ్మాయిని ఎప్పుడు చేర్చబోతున్నారు మా కాలేజీలో?'' చాలా ధీమాగా అడిగాడు.

''ఇక్కడేదైనా స్పోర్ట్స్ షాప్ ఉందా?'' సడన్‌గా అడిగాడు విజ్ఞేశ్వర్.

''ఆ! ఇక్కడే! దగ్గర్లోనే ఉంది. చూపిస్తాను రండి.'' ఆశ్చర్యపోతూ దారితీశాడు నవ్యక్. తేజు కూడా ఆశ్చర్యంగానే నడిచింది. షాపు చూపించి, తేజుని జాయిన్ చెయ్యమని మళ్ళీ మళ్ళీ రిక్వెస్ట్ చేసి విజిటింగ్ కార్డు యిచ్చి వెళ్ళిపోయాడు నవ్యక్.

స్పోర్ట్స్ షాప్‌లో బేస్‌బాల్ స్టిక్ ఒకటి కొన్నాడు విజ్ఞేశ్వర్. షాపతను బిల్లు రాస్తుంటే జేబులోంచి సెల్ తీసి బటన్స్ నొక్కాడు విజ్ఞేశ్వర్.

''హలో, ట్రావెల్ హౌసేనా? ఢిల్లీకి ఒక స్లీపర్ క్లాసు టికెట్ బుక్ చేయండి. ఎంత తొందరలో వీలయితే అంత తొందరగా. మీ ఓనర్ గారికి చెప్పండి విజ్ఞేశ్వర్ అంటే తెలుస్తుంది. ఓకే?! థాంక్యూ.''

తేజుకి ఏమీ అర్థంకాలేదు.

''ఏంటి డాడీ. బేస్ బాల్ స్టిక్ కొన్నావు. ఢిల్లీకి టికెట్ బుక్ చేశావు? ఏం చేస్తున్నావు డాడీ?''

చొక్కాపైకి చేతులు మడిచి, చేతిలో వున్న బేస్ బాల్ స్టిక్‌ని అటూ ఇటూ తిప్పి చూస్తూ అన్నాడు విజ్ఞేశ్వర్.

''ఏంలేదు. ఢిల్లీలో చిన్నపని ఉంది.''

అర్థంచేసుకోవడానికి ప్రయత్నిస్తూ తలతిప్పి అటూ యిటూ చూసింది తేజు. షాపులో పక్కనే టేబుల్ మీద పడి వున్న న్యూస్‌పేపర్ హెడ్‌లైన్స్ అప్రయత్నంగా చదివింది.

''ఖాళీగా పడివున్న ముప్పైవేల ఇంజనీరింగ్ సీట్లు. నిబంధనలను మరింత సడలించనున్న ఎఐసిటిఇ పుట్టగొడుగుల్లా రాబోతున్న మరిన్ని ఇంజనీరింగ్ కాలేజీలు.''

ఇంజనీరింగ్ సీటు దొరికినంత సులభంగా వెంటనే అంతా అర్థమైపోయింది తేజుకి.

★

## కథలు రాసి చాలా సంపాదించాను



**క**డపలో జరిగిన ఒక సాహిత్య సభలో వేదిక మీద 'సరస్వతీపుత్ర' పుట్టపర్తి నారాయణాచార్య మధురాంతకం రాజారామ్ ఆసీనులయ్యారు. నారాయణాచార్య మధురాంతకం గారిని ప్రేమగా పలకరించి ''ఏమప్పా! చాలాకాలంగా రాస్తున్నావు గదా! ఏమైనా వెనకేశావా?'' అని అడిగారు.

''నా సంగతి సరే స్వామీ! పెద్దలు మీరు. చాలా గ్రంథాలు రచించారు. మీరేమాత్రం సంపాదించారు?'' అని ప్రశ్నించారు మధురాంతకం.

అందుకాయన పెద్దగా నవ్వి ''నాకొచ్చిందేం లేదు. పబ్లిషర్లు మాత్రం లబ్ధిపొందారు'' అన్నారు.

మధురాంతకం చొరవగా ''మీరేమోగాని స్వామీ! నేను మాత్రం కథలు రాసి చాలా సంపాదించాను. సాహిత్య సభలో వేదికమీద, మీపక్కన కూర్చుండే భాగ్యం పొందాను. ఇది నాకు పెద్ద సంపద'' అన్నారు.

– సేకరణ: రామమోహనరాయ్